epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:345

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 18.07.2026 శనివారం, హైదరాబాద్

## చమురు సంక్షోభం ఉన్నా అభివృద్ధి ఆగిపోలేదు

- దాదాపు 90శాతం నెట్‌వర్క్‌ను విద్యుద్దీకరించాం
- హర్యానాలో తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ



2లో

# ఈ సారి సాగు అంతంత మాత్రమే

## అంచనా 132 లక్షల ఎకరాలు..ఇప్పటివరకు 59.83 లక్షలే

- వర్షా భావంతో మారుతున్న సాగు ముఖచిత్రం
- వరి నాట్లకు జంకుతున్న అన్నదాతలు
- సోయాబిన్, పత్తి పంటలు ఆశాజనకం
- ఎండిన వరి పొలం..ఎదగని మక్కలు
- నాణ్యత లేని పత్తి... అడుగంటిన ప్రాజెక్ట్



వానాకాలం ప్రారంభమై నెల న్నర గడిచినా ఆశించిన స్థాయిలో వర్షా లు లేకపోవడంతో సాగు మందగించింది. ఎల్ నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలహీనపడటం రాష్ట్ర వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభా వం చూపుతోంది. ఈ వానాకాలం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల పంటలు కలిపి 1,32,38,446 ఎకరాల్లో సాగు అవుతుందని ప్రభుత్వం అంచనా వేయగా.. ఇప్పటివరకు 59,83,971 ఎకరాల్లో (45.20శాతం) మాత్రమే సాగు చేశారు. అంటే లక్ష్యంలో 50 శాతం కూడా దాటలేదు. వరి సాధారణ సాగు లక్ష్యంగా 65.96 లక్షల ఎక రాలుగా నిర్దేశించగా 6.60 లక్షల ఎకరాలకు మించలేదు. కేవలం 9.70 శాతం మాత్రమే నాట్లు పడడం కరువు తీవ్రతకు అద్దం పడుతోంది. జొన్న, సజ్జ, మక్కజొన్న, రాగి, ఇతర చిరుధాన్యాల సాగు లక్ష్యం 72.49 లక్షల ఎక రాలు కాగా, కేవలం 10.20 లక్షల ఎకరాల్లోనే (14.08 శాతం) సాగైంది.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:** పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 47.41 లక్షల ఎకరాలు ఉండగా 41.12 లక్షల ఎకరాల్లో అంటే 86.72 శాతం విత్తనాలు నాటారు. సోయాబిన్ 4.16 లక్షల ఎకరాలు అంచనా వేయగా, 3.35 లక్షల ఎకరాల్లో విత్తనాలు నాటారు. సోయాబిన్ కూడా 80.57 శాతం వరకు పంట నమోదైంది ఈ సమయానికి వ్యవసాయ పనులతో కళకళలాడాల్సిన పంట పొలాలు బోసిపోయి కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో సుమారు 65 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు, కూలీలు ఉన్నారు. వీరంతా వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా బతుకుతున్నారు. రైతులు సాధార ణంగా జూన్, జులై మాసాల్లో విత్తనాలు విత్తుకోవడం, వరి నాట్లు వేసుకోవడంలో తీరిక లేకుండా ఉంటారు. కానీ, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉపాధి లేక రైతులు,

మిగతా 2 లో




## ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్ఈహెచ్ఎస్ బరోసా

- ఉద్యోగులకు హెల్త్ స్కీం.. నూతన అధ్యాయం
- 8 లక్షల మందికి నగదురహిత వైద్యం
- 886 ఆస్పత్రుల్లో 1,816 రకాల చికిత్సలు
- ఉద్యోగులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు
- రూ.10 వేల కోట్ల పాత బిల్లులు చెల్లిస్తున్నాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి 'ఎన్ఈహెచ్ఎస్' ప్రారంభం

2లో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలకు భరోసా కల్పించే లక్ష్యం తో ప్రజాప్రభుత్వం న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఎన్ఈహెచ్ఎస్) ప్రవేశపెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆందోళనలు లేకుం డా మెరుగైన ఆరోగ్య భద్రత అందించడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం ఎంప్లాయీస్ హెల్త్ స్కీం, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు.



## 20వరకు బతికే ఉంటా

- మీ అందరితో కలిసి పార్లమెంటుకు కవాతు చేస్తా
- ఒకవేళ కవాతు విజయవంతం కాకపోతే ..నేను దెయ్యంగా తిరిగి వస్తా
- పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్
- విషమిస్తోన్న ఆరోగ్యం 24 గంటల పర్యవేక్షణ
- సీజేపీ చేపట్టిన ఆందోళన 27వ రోజుకు
- సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష నాటికి 20 రోజులు
- కేంద్ర ప్రభుత్వం తన మౌనాన్ని వీడి, అర్థవంతమైన చర్చలు జరపాలి
- కేరళం మాజీ సీఎం పినరయి విజయన్,
- ప్రముఖ క్రీడాకారిణి మను భాకర్
  రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్
- సహా పలువురి సంఘీభావం

2లో

## నేడే బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు

- పోలీసుల నిరాకరించడంతో హైకోర్టు అనుమతి
- యువత గొంతు నొక్కాలని యత్నించిన ప్రభుత్వ కుట్ర విఫలం
- కాంగ్రెస్ ఎన్ని అవరోధాలు సృష్టించినా
- బీఆర్ఎస్ పార్టీ గళం విప్పుతూనే ఉంటుంది
- రేవంత్ సర్కార్ మెడలు వంచుదాం
- హామీల అమలుకు జంగ్ సైరన్ పూరిద్దాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో




బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సు శనివారం ఉదయం పది గంటలకు జరగనుంది. అయితే ఈ సదస్సు నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు అనుమతి ఇవ్వడంతో యువ సంగ్రామ సదస్సుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఎక్స్ ద్వారా స్పందించారు.

-తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో



## ధరణి పోర్టల్ అవకతవకలపై సిట్

- సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ
- ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని నిర్ణయం
- పంచాయతీల ఆదాయం సొంత ఖాతాలోనే వేయాలి
- వర్షా భావ పరిస్థితులపై కేంద్రానికి లేఖ
- తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- ఎల్నినో ప్రభావంపై అవగాహన సదస్సులు
- వర్షా భావ సంక్షోభాన్ని అధిగమించాలి
- కేబినెట్ భేటీ అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

2లో


## పదేళ్లలో 152 పేపర్ లీకులు



- పేపర్ లీక్స్ నిజాయతీ విద్యార్థుల భవిష్యత్తును నాశనం
- ఈ నాలుగు అన్యాయాలపైనే పోరాడాలి
- డెహ్రాడూన్‌లో 'ఛాత్రోం కీ గూంజ్' లో విద్యార్థులతో మాట్లాడిన రాహుల్ గాంధీ
- కొందరు మాత్రమే వ్యవస్థను దుర్వినియోగం చేసి అందరినీ నష్టపరుస్తున్నారు
- కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు

2లో

## ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు..



- రైల్వే స్టేషన్లు,ఎయిర్‌పోర్టులపై మిస్సైల్ దాడులు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- హర్మూజ్ జలసంధి పరిసరాల్లో వరుసగా రెండో రోజు దాడులు
- బందర్ అబ్బాస్, రైల్వే వ్యవస్థపై సైతం దాడులు
- గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు మరింత దిగజారుడు

5లో



# ఈ సారి సాగు అంతంత మాత్రమే

**తరువాయి భాగం**

వ్యవసాయ కూలీలు ఖాళీగా ఉంటున్నారు.
జూన్‌లో 2 శాతం, జూలైలో 16 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ నెలాఖరు వరకు పరిస్థితులుల ఎలా ఉంటాయోనని ఆయా వర్గాల్లో ఆందోళన నెలకొంది. జూన్ 10 లోపు పత్తి విత్తనాలను నాటుకోవాల్సి ఉంటుంది. ఈనెల రెండో వారంతో అదును దాటిపోయింది. వరి నాట్లు వేసే పరిస్థితి కూడా లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. భూగర్భ జలాలు అడుగుంటడంతో బోర్లు ఆగిపోస్తున్నాయి.
ఒక వేళ చిన్న వర్షాలు పడినా నాటు వేయలేమని రైతులు చెబుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ లాంటి జిల్లాల్లో కొందరు రైతులు సాహసించి బోర్లు, బావుల కింద కొద్దిమేర వరి నాట్లు వేశారు. పత్తి, సోయాబిన్ మినహా మిగతా అరుతడి పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది. మొత్తంగా వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామాల్లో పశువులకు పచ్చిమేత దొరకని పరిస్థితి నెలకొంది.

**హైదరాబాద్‌లో అడుగంటుతున్న జల మట్టాలు**

ఎల్ నినో హైదరాబాద్ ప్రజలను భయపెడుతోంది. ఇక్కడ అత్యంత వేగంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. జంటనగరాల్లో 2.47 మీటర్ల మేర పడిపోయి సగటున 12.43 మీటర్ల లోతుకు చేరాయి. పరిస్థితులు చూస్తుంటే రాబోయే రోజుల్లో తాగు నీటికి తీవ్ర ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది



# 20వరకు బతికే ఉంటా

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ, సీబీఎస్ఈలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష శుక్రవారం నాటికి 20 రోజులు పూర్తి చేసుకుంది. దీక్షతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన 24 గంటల పర్యవేక్షణలో ఉన్నారు. దీక్ష ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు వాంగ్‌చుక్ 9.5 కిలోల బరువు తగ్గారు. మరోపక్క జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళన 27వ రోజుకు చేరుకుంది. అక్కడే నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి కూడా క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యే రోజు 20న పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తామని సీజేపీ చీఫ్, వాంగ్‌చుక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాంగ్‌చుక్ మాట్లాడుతూ "నేను ఈనెల 20 వరకు ఎలాగైనా బ్రతికి ఉంటా. మీ అందరితో కలిసి పార్లమెంటుకు కవాతు చేస్తా. ఒకవేళ జులై 20న మన కవాతు విజయవంతం కాకపోతే నేను దెయ్యంగా తిరిగి వస్తాను" అని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లోనూ సోనమ్ వాంగ్‌చుక్ తన హాస్య చతురతను కోల్పోలేదు. వాంగ్‌చుక్‌కు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. శుక్రవారం సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజ్జూ కృష్ణన్, అశోక్ ధావలే, కేంద్ర కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ , సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ సంఘీభావం తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆందోళన వేదికైన క్రాంతి కార్నర్ వద్ద విద్యార్థులు, యువతను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రశ్నాపత్రాల లీకేజ్‌లపై స్పందించకపోవడం దారుణమన్నారు.
సోనమ్ వాంగ్‌చుక్‌కు కేరళం మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ సంఘీభావం తెలిపారు. "సోనమ్ వాంగ్‌చుక్ తన నిరవధిక నిరాహార దీక్షలో ఆరోగ్యం విషమించిందన్న వార్తలతో తీవ్ర ఆవేదనకు గురయ్యాను. న్యాయం కోసం పోరాడుతున్న ఒక పౌరుడు ప్రాణాలు కోల్పోయే అంచున ఉన్నప్పుడు ఏ ప్రభుత్వమూ ఉదాసీనంగా ఉండకూడదు. కేంద్ర ప్రభుత్వం తన మౌనాన్ని వీడి, అర్థవంతమైన చర్చలు జరపాలి. నీట్ పేపర్ లీక్ సంక్షోభం నేపథ్యంలో జాతీయ పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణలతో సహా జవాబుదారీతనం కోసం వస్తున్న న్యాయమైన డిమాండ్లకు స్పందించాలి. న్యాయం, జవాబుదారీతనం కోసం సోనమ్ వాంగ్‌చుక్, విద్యార్థులు చేస్తున్న పోరాటానికి అచంచలమైన సంఘీభావం తెలుపుతున్నాను" అని ఎక్స్‌లో పినరయి స్పందించారు. వాంగ్‌చుక్ దీక్ష, సీజేపీ ఆందోళనకు ప్రముఖ క్రీడాకారిణి మను భాకర్ మద్దతు ఇచ్చారు. ప్రముఖ హాస్యనటుడు మహీప్ సింగ్, ఛత్తీస్‌గఢ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు టి.ఎస్. సింగ్‌డియో, రాజస్తాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ సోనమ్ వాంగ్‌చుక్ కు, నిరసనకారులకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. హర్యానా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా, ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సులే, కాంగ్రెస్ నేత సీనియర్ నేత పవన్ ఖేర్, ముంతాజ్ పటేల్, యూపీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రాజేంద్ర పాల్ గౌతమ్, యోగేంద్ర యాదవ్, 'వంచిత బహుజన అఘాడి' అధ్యక్షుడు ప్రకాశ్ అంబేద్కర్ సంఘీభావం తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్ఈహెచ్ఎస్ బరోసా

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలకు భరోసా కల్పించే లక్ష్యం తో ప్రజాప్రభుత్వం న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఎన్ఈహెచ్ఎస్) ప్రవేశపెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆందోళనలు లేకుండా మెరుగైన ఆరోగ్య భద్రత అందించడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. వైద్య ఖర్చు ల కోసం ఉద్యోగులు, వారి కుటుంబాలు అప్పులపాలవుతున్న పరిస్థితులను తమ ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఎన్ఈహెచ్ఎస్ ద్వారా సుమారు 8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. రాష్ట్రంలోని 886 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సీజీహెచ్ఎస్ ప్యాకేజీల కింద 1,816 రకాల చికిత్సలు నగదురహితంగా అందనున్నాయని వెల్లడించారు.శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క, ఎంప్లాయిస్ హెల్త్‌కేర్ ట్రస్టు బోర్డు సభ్యులు, ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి ఎన్ఈహెచ్ఎస్‌ను ప్రారంభించారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, నాయకులు పుల్లం దామోదర్ రెడ్డి, చావా రవి, సదానందంగౌడ్, వంగ రవీందర్‌రెడ్డి, కటకం రమేష్, లచ్చిరెడ్డి, కృష్ణయాదవ్ తదితరులకు డిజిటల్ హెల్త్ కార్డులు అందజేశారు.
ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగులకు సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధికి ఈ పథకమే నిదర్శనమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మానవీయ కోణంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకుందన్నారు.ఉద్యోగులు కూడా మన కుటుంబ సభ్యులేనని, వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనే సదుద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ కమిటీకి తాను చైర్మన్‌గా, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నామని, దాని ప్రతిరూపమే 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' అని వివరించారు.కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) ప్యాకేజీ రేట్లకు అనుగుణంగా 1,816 రకాల వైద్య, శస్త్రచికిత్సలను 'ఎన్ఈహెచ్ఎస్' కవర్ చేస్తుందని వివరించారు. ఈ పథకం పారదర్శకంగా, సజావుగా సాగేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమాన భాగస్వామ్యంతో ఒక ప్రత్యేక 'ట్రస్ట్' ను ఏర్పాటు చేశామన్నారు.

**గత పాలకుల నిర్లక్ష్యంతోనే..**

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తమ ఆరోగ్య భద్రత కోసం సకలజనుల సమ్మెతో సహా ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం దక్కలేని, విజ్ఞప్తులను బుట్టదాఖలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ 10 వేల కోట్ల బకాయిలను నెలకు రూ.2 వేల కోట్ల చొప్పున తమ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ పథకాన్ని ప్రతి 15 రోజులకో సారి తానే స్వయంగా సమీక్షిస్తూ ఒక్క రూపాయి కూడా మెడికల్ బిల్లులు పెండింగ్ లేకుండా చూస్తున్నానని స్పష్టం చేశారు.
రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని, అర్హులైన 1.06 కోట్ల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం ఇంతటి చిత్తశుద్ధితో పనిచేస్తున్న నేపథ్యంలో, ప్రతి ఉద్యోగి రెట్టింపు ఉత్సాహం, నిబద్ధతతో పనిచేయాలని డిప్యూటీ సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరి డా.క్రిస్టినా జడ్ చోంగ్తూ, విద్యాశాఖ సెక్రటరి యోగితరాణా, స్పెషల్ ఛీఫ్ సెక్రటరి జీఏడి మహేష్ దత్ ఎక్కా, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరి సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి.శ్యామ్, మధుసూదన్ రెడ్డి, బిక్షం గౌడ్, సత్యనారాయణ రెడ్డి, ఉమా, ఎం.అంజిరెడ్డి, అనిల్ కుమార్, వెంకట్, పొడ్నాల రాజశేఖర్, పర్వతి సత్యనారాయణ, పర్వత్ రెడ్డి, ప్రేమ్ తదితర ఉద్యోగ సంఘాల నాయకులు, నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.




**అత్యాధునిక వైద్యం : మంత్రి దామోదర రాజనర్సింహ**

ఎన్ఈహెచ్ఎస్ ద్వారా ఉద్యోగులకు అపోలో, కిమ్స్, మెడికవర్ వంటి కార్పొరేట్ హాస్పిటళ్లలోనూ క్యాష్‌లెస్ వైద్యం అందనున్నదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పేద ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశంలోనే తొలిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.
ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అమలు చేసిందన్నారు. గతంలో అమలులో ఉన్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లో ప్యాకేజీ రేట్లు తక్కువగా ఉండటంతో అనేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ భాగస్వామ్యం కావడం లేదని, క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం, ఉద్యోగుల ప్రాతినిధ్యం లేకపోవడం, ప్యాకేజీల సవరణలో పరిమితులు వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. వాటన్నింటికీ శాశ్వత పరిష్కారంగా ఈ కొత్త పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఎన్ఈహెచ్ఎస్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. డిజిటల్ హెల్త్ కార్డులను వెబ్ పోర్టల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12 వెల్‌నెస్ సెంటర్ల ద్వారా రోజూ సుమారు 1,800 మందికి ఔట్ పేషెంట్ సేవలు అందుతున్నాయని, త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు.

# పదేళ్లలో 152 పేపర్ లీకులు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో నిర్వహించిన 'ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గర్జన)' కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులతో నేరుగా సంభాషించారు. దేశంలో విద్యా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ, పేపర్ లీక్స్, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, యువత ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. ఇది రాజకీయ సభ కాదని, విద్యార్థుల భవిష్యత్తు, వారి పోరాటం, విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశం అని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రస్తుతం నాలుగు ప్రధాన సమస్యల్ని, అన్యాయాల్ని ఎదుర్కొంటున్నారని రాహుల్ గాంధీ అన్నారు. మొదటిది చదువులకు ఖర్చు భారీగా పెరగడం, రెండోది యువతకు అందుబాటులో ఉండే 5 అవకాశాల్లో నాలుగు మార్గాల తలుపులు మూసుకుపోవడం, మూడోది వందలాది మంది పోటీపడినా ఒకరికో, ఇద్దరికో విజయం దక్కడం, నాలుగోది అత్యంత ప్రమాదకరమైన పేపర్ లీకులు అని పేర్కొన్నారు. వీటిపై పోరాడాలని పిలుపునిచ్చారు.దేశంలో యువతకు ప్రతి 5 అవకాశాలకు 4 అవకాశాల తలుపులు మూసుకుపోయాయి. మొదటిది, భారతదేశంలో తయారీ రంగం పూర్తిగా నిలిచిపోయింది. చైనా ఉత్పత్తులే భారత మార్కెట్‌ను ఆక్రమించడంతో ఉపాధి అవకాశాలు తగ్గాయి. రెండోది వ్యాపారం చేయాలనుకునే యువతకు బ్యాంక్ రుణాలు సులభంగా అందట్లేదు. బ్యాంక్ నిధులు కొద్ది మంది పెద్ద పారిశ్రామికవేత్తలకే పరిమితమయ్యాయి. మూడోది కృత్రిమ మేధ ప్రభావంతో ఐటీ, కార్పొరేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు దెబ్బతిన్నాయి. నాలుగోది ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరణ చేయడం ద్వారా ఆ తలుపులు కూడా మూసేశారు. చివరగా ప్రభుత్వ ఉద్యోగాలే యువతకు మిగిలిన చివరి అవకాశం అయింది. అంతా ఈ డోర్‌వైపే పరుగులు తీస్తున్నారు. అయితే కోట్లాది మంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం పరీక్షలు రాస్తున్నప్పటికీ, చివరికి కొద్దిమందికే ఉద్యోగాలు లభిస్తున్నాయి. సుమారు 6 కోట్ల మంది ఈ ఒక్క డోర్‌వైపే పరుగులు తీస్తున్నారు. కానీ అందులో లక్షల మందికే అవకాశం వస్తోంది. మిగిలిన వారు నిరాశకు గురవుతున్నారు. ఇక్కడ పోటీ తీవ్రతతో పాటు విద్య ఖర్చు, పేపర్ లీక్స్ యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి.' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.దేశంలోని పరీక్షల నిర్వహణ వ్యవస్థ, పేపర్ లీక్‌లపై ఈ వేదికగా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. పరీక్ష ప్రశ్నపత్రాల లీక్స్ కోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నాపత్రాలు టెలిగ్రామ్, సిగ్నల్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారంలలో అందుబాటులో ఉంటున్నాయని, అయితే వాటిని పొందాలంటే కోట్ల రూపాయలు చెల్లించే స్థోమత ఉండాలని వ్యాఖ్యానించారు. ఇదే ప్రస్తుతం భారతదేశ విద్యా వ్యవస్థ పరిస్థితి అని దుయ్యబట్టారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, సగటున ప్రతి నెల ఒక పేపర్ లీక్ అయినట్లేనని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఘటనల కారణంగా సుమారు 7.5 కోట్ల మంది యువత నష్టపోయారని వ్యాఖ్యానించారు. వరుస పేపర్ లీక్స్ జరుగుతున్నా ఇప్పటికీ ఒక్క కేసులో కూడా శిక్ష పడలేదని, ఒక్క వ్యక్తి కూడా జైలుకు వెళ్లలేదని రాహుల్ ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దందా మరింత పెరుగుతోందని అన్నారు.'వ్యవస్థను కేవలం ఒక శాతం మంది మాత్రమే దుర్వినియోగం చేస్తున్నారు. కానీ దాని ప్రభావం నిజాయతీగా చదివే 99.9 శాతం మంది పేద, మధ్యతరగతి విద్యార్థులపై పడుతోంది.' అని రాహుల్ గాంధీ అన్నారు. ఇక విద్యార్థుల ముందున్న రెండు మార్గాల్ని వివరిస్తూ ఒకటి నిజాయతీ, కష్టపడి చదివే మార్గమైతే; మరొకటి డబ్బు, అవినీతి, మోసాల ద్వారా పేపర్ లీక్ మార్గం అని వ్యాఖ్యానించారు. ఈ మార్గంలో వెళ్లాలంటే మధ్యతరగతి లేదా పేద కుటుంబానికి చెందినవారిగా ఉండకూడదని, నిజాయతీ అవసరం లేదని అన్నారు. అయితే 99.9 శాతం మంది విద్యార్థులు నిజాయతీ మార్గాన్నే ఎంచుకుంటున్నారని, కొందరు మాత్రమే వ్యవస్థను దుర్వినియోగం చేసి అందరినీ నష్టపరుస్తున్నారని అన్నారు.

# ధరణి పోర్టల్ అవకతవకలపై సిట్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూడు గంటల పాటు సాగిన ఈ భేటీలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ధరణి లావాదేవీలపై సమగ్రవిచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో సిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీల ఆదాయం సొంత ఖాతాలోనే జమ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశం అనంతరం నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.
భూముల రికార్డులు, భూ క్రయ విక్రయాలకు సంబంధించి ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రత్యేక సిట్ ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి తెలిపారు. 2020 అక్టోబర్ 29 నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి రాష్ట్రంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా జరిగిన అన్ని అనుమానాస్పద లావాదేవీలను లోతుగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించిందని వివరించారు.
ఇప్పటికే చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్ లో దాదాపు 10 వేలకుపైగా అనుమానాస్పద లావాదేవీలున్నట్లు ప్రభుత్వం గుర్తించిందని వివరించారు. అందుకే భూముల లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ రికార్డులు, లాగిన్ వివరాలు, రికార్డుల్లో చేసిన మార్పులు, అధికారుల అనుమతులు, భూముల వర్గీకరణ మార్పులు, లబ్ధిదారుల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. ధరణిలో పోర్టల్ తర్వాత కొన్ని మాడ్యుల్స్ మార్చి రైతులకు ఉపయోగంగా ఉండేలా తమ ప్రభుత్వం భూభారతి అమల్లోకి తెచ్చిందని పొంగులేటి తెలిపారు. ఇప్పటికీ ఆనాడు సాఫ్ట్ వేర్ రూపకల్పన చేసిన పోర్టల్ లో ఉన్న లోపాలతో అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. అందుకే ధరణి వ్యవహారంలో బాధ్యులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. సిట్ వేసి బాధ్యులను గుర్తించాలని నిర్ణయించిందని వివరించారు.
రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. పంటల సాగు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభావం, తాగునీరు సాగునీటి ఇబ్బందులు, ఉపాధి కూలీల పరిస్థితులను సమగ్రంగా వివరిస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపించాలని, ఎల్‌నినో కంటింజెన్సీ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని చెప్పారు.ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో దాదాపు 40 శాతం వర్షపాతం లోటు ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారన్నారు. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు ఉన్నందున, అన్ని శాఖలు ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు చేసే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగును రైతులు నివారించి, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు కేబినేట్ విజ్ఞప్తి చేసింది.ఎల్నినో ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించింది. రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ చిన్నారెడ్డి సారథ్యంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో వ్యవసాయ రంగంపై ఎల్నినో ప్రభావంపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని మంత్రివర్గం సూచించింది.అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, వెంటనే చేపట్టాల్సిన చర్యలను తెలుసుకునేందుకు అత్యవసర సమీక్ష సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెల 20వ తేదీ సోమవారం ఉమ్మడి జిల్లాల వారీగా జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో అక్కడి ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి జిల్లా ఇన్ ఛార్జీ మంత్రితో పాటు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారికి ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ఈ ప్రకృతి గండం నుంచి గట్టెక్కేందుకు అన్ని శాఖలు సన్నద్ధంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ, సమన్వయంతో పనిచేసి వర్షాభావ సంక్షోభాన్ని అధిగమించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

**మరిన్ని కీలక నిర్ణయాలు ఇవే :**

టెండర్ల ప్రక్రియ కోసం ప్రత్యేక చట్టం చేయాలని కేబినెట్ నిర్ణయం
అన్ని శాఖల్లో టెండర్ల ప్రక్రియ ఒకే తీరుగా ఉండేలా చట్టం తేవాలని నిర్ణయం
పంచాయతీల సొంత ఆదాయాన్ని గ్రామ పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలని కేబినెట్ నిర్ణయం
మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ట్రాన్స్ జెండర్లను కోఆప్షన్ సభ్యులుగా నియమించాలని నిర్ణయం
ఇందుకోసం మున్సిపాలిటీస్ చట్టం-2019ను సవరించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది

**శంషాబాద్ సమీపంలో రైల్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.**

హైదరాబాద్-పుణె-ముంబైకి ఒక రూట్, హైదరాబాద్-బెంగుళూరు మరో రూట్, హైదరాబాద్-అమరావతి-తిరుపతి-చెన్నై మరో రూట్ బుల్లెట్ రైళ్లకు కేంద్రం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
ముక్తేశ్వర్ ఎత్తిపోతల పథకం (చిన్న కాళేశ్వరం) పూర్తి చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గోదావరి నదిపై కన్నెపల్లి నుంచి 4.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి మంథని నియోజకవర్గంలో 45 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ఈ పథకం పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయిచింది. ఇప్పటికే పూర్తయిన పనులను అంచనా వేసుకొని, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలిపింది.

# నేడే బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సు శనివారం ఉదయం పది గంటలకు జరగనుంది. అయితే ఈ సదస్సు నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు అనుమతి ఇవ్వడంతో యువ సంగ్రామ సదస్సుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఎక్స్ ద్వారా స్పందించారు. యువ సంగ్రామ సదస్సును అడ్డుకుని, నిరుద్యోగ యువత గొంతు నొక్కుదామని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి కుట్ర విఫలమైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే హైకోర్టు ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ సదస్సుకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్ని అవరోధాలు సృష్టించినా యువత తరఫున బీఆర్ఎస్ పార్టీ గళం విప్పుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. యువతీ యువకులారా తరలిరావాలనీ, సరూర్‌నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ మోసాలను ఎండగడదామని ఆయన పిలుపునిచ్చారు. రేవంత్ సర్కార్ మెడలు వంచుదామనీ, హామీల అమలుకు జంగ్ సైరన్ పూరిద్దామని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ అవలంభిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం జరిగే "యువ సంగ్రామ సదస్సు"కు పెద్ద సంఖ్యలో తరలి రావాలని బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. సరూర్ నగర్ స్టేడియం వద్ద బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి యువత అంటే ఎందుకింత భయమని ప్రశ్నించారు. కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమకారులను అవమానించిందని అన్నారు. రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక హక్కులు సీఎం రేవంత్‌రెడ్డి చదువుకోవాలని సూచించారు. హక్కులు కాపాడాలని రాహుల్ గాంధీ అంటుంటే, రేవంత్ రెడ్డి కాలరాస్తున్నారని విమర్శించారు. న్యాయస్థానం తీర్పును గౌరవిస్తామని చెప్పారు.



# రైతులు పామాయిల్ పంట సాగు చేయాలి

- పామాయిల్ మొక్కలు నాటిన ఉద్యానవనశాఖధికారి
- గడ్డం శ్యామ్ ప్రసాద్

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామ శివారులోని గోపగోని రంజిత్ తోటలో పామాయిల్ మొక్కలను జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయిల్ పామ్ రైతులతో సమావేశమై తోటల నిర్వహణ,దిగుబడుల పెంపు, ఎరువుల యాజమాన్యం,నీటి నిర్వహణ,తెగుళ్లు,పోషకాహార లోపాల నివారణపై సాంకేతిక సూచనలు అందించారు.ప్రస్తుతం సాగులో ఉన్న ఆయిల్ పామ్ తోటలను పరిశీలించి రైతులు అనుసరిస్తున్న మెరుగైన సాగు విధానాలను అభినందించారు. శ్రీరాంపూర్ మండలంలో ఇప్పటికే విజయవంతంగా సాగవుతున్న ఆయిల్ పామ్ తోటలను చూసి మరో చాలా మంది రైతులు ఈ పంట వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు.202627 సంవత్సరానికి మండలంలో ఇప్పటివరకు 60 ఎకరాల్లో పామాయిల్ మొక్కలు నాటడం జరిగిందని,అదనంగా ఇంకా 50 ఎకరాల్లో కొత్తగా ఆయిల్ పామ్ తోటల ఏర్పాటు లక్ష్యంగా రైతులు ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు.రంజిత్ ను ఆదర్శంగా తీసుకుని మిగతా రైతులు పామాయిల్ పంట సాగు చేయాలని పిలుపునిచ్చారు.ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని, ప్రభుత్వ ప్రోత్సాహకాలు , కంపెనీల సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మరింత విస్తీర్ణంలో సాగు చేపట్టాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి మహేష్,ఉద్యాన విస్తరణ అధికారి రాము,వ్యవసాయ అధికారిణి సంధ్య,ఏఎంసి చైర్మన్ తిరుపతి రెడ్డి,మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్,సర్పంచ్ రమేష్, ఎఈఓలు సతీష్,ఈశ్వర్,ఫీల్డ్ ఆఫీసర్ అజయ్,శ్రీనివాస్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నీనో ప్రభావం రైతులకు అవగాహన

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామంలో గల గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం గ్రామ సర్పంచ్ పోశాల శైలజ సదానందం గౌడ్ ఆధ్వర్యంలో ఎల్ నీనో ప్రభావం గురించి అవగాహన కార్యక్రమంను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఏఈఓ స్పందన మాట్లాడుతూ....ఎల్ నీనో ప్రభావం వలన వర్షాలు తక్కువగా కురుస్తాయని వారికి బదలు ప్రత్యమ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోశాల శైలజసదానందం గౌడ్,ఏ.ఈ.ఓ స్పందన,రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా

- సర్పంచ్ తుల మనోహర్ రావు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మొట్లపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ తుల మనోహర్ రావు శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ....ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో రాబోవు రోజుల్లో గ్రామంలోని అభివృద్ధి పనులతో పాటు మౌలిక వసతుల కల్పన కృషి చేస్తానన్నారు. సీసీ రోడ్ నిర్మాణం కోసం రోడ్డు వెడల్పుకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మహేందర్ రెడ్డి ఉప సర్పంచ్ బొమ్మల సుమలత సదయ్య,వార్డు సభ్యులు సముద్రాల వసంత రాజేశం,అనుముల రమేష్,బెజ్జల సంపత్,దొమ్మటి పోచాలు,గాదర్ల శారద మొండయ్య, బెజ్జాల మానస రవి,నాయకులు కొత్తిరెడ్డి రాజిరెడ్డి గాదర్ల శంకర్ గౌడ్,దొమ్మటి చంద్రయ్య,తదితరులు ఉన్నారు.




## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసరించాలి

- సర్పంచ్ తుల మనోహర్ రావు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మొట్లపల్లి గ్రామంలో గల గ్రామ పంచాయతీలో రైతులతో శుక్రవారం సమావేశం గ్రామ సర్పంచ్ తుల మనోహర్ రావు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...ఎల్ నీ నో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవవాని వాతావరణ శాఖ సూచన మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు నీటి వసతి ఉన్న పొలాల్లో మాత్రమే వరి సాగు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి స్పందన పంచాయతీ కార్యదర్శి మహేందర్ రెడ్డి ,గ్రామ పరిపాలన అధికారి స్వాతి,వార్డు సభ్యులు రైతులు పాల్గొన్నారు.



## ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని తారుపల్లి గ్రామానికి చెందిన సల్పాల బాలకృష్ణ 2025లో ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ లో సుప్రీం పాలసీ తీసుకోగా,2026 జనవరిలో గుంపుల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా,ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా 20,50,000 రూపాయలను మృతుని భార్య విజయ లక్ష్మికి ఎస్బిఐ డివిజనల్ మేనేజర్ కొత్తపల్లి సతీష్,బిజినెస్ మేనేజర్ శ్రీరామోజు నాగేశ్వర్,సర్పంచ్ రమేష్,మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి,మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా సారయ్య గౌడ్ మాట్లాడుతూ...మనిషి జీవితంలో ఎప్పుడూ ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని,ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ పాలసీ చేయించుకోవాలన్నారు.ఇన్సూరెన్స్ పాలసీ వారి పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని తెలిపారు.మృతుని భార్య విజయలక్ష్మి కు ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన 20 లక్షల 50 వేలు చెక్కు అందజేయడం జరిగిందని,మృతుని కుమార్తెకు భవిష్యత్తులో చెల్లించడం జరుగుతుందన్నారు.హుజురాబాద్ బ్యాంకు సిబ్బందిని మాజీ ఎంపీపీ,మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్బిఐ లైక్ఇన్సూరెన్స్,సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజనవేణ సదయ్య,సర్పంచ్ లు తులా మనోహర్ రావు,జిన్న రామచంద్రారెడ్డి,మాజీ సర్పంచ్ మాదాసి సతీష్,తదితరులు పాల్గొన్నారు.



## భూముల సర్వేపై అవగాహన సదస్సు

- తాసిల్దార్ రాపేల్లి రాముడు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కిష్టంపేట లో తహశీల్దార్ రాపెల్లి రాముడు ఆధ్వర్యంలో గోముల సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ... భూధార్ కేటాయించాలనే లక్ష్యంతో భూముల రీ సర్వే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుందని తహశీల్దార్ వెల్లడించారు.సర్వే సమయంలో సంబంధిత భూమి యజమానులు హద్దులు కేటాయించే సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు.అభ్యంతరాలు ఉంటే అప్పీల్ చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పురుషోత్తం భాగ్య రవీందర్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ వినోద్,రైతులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.




## వికలాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ

**తెలంగాణ చౌరస్తా న్యూస్,ఓదెల**

పెద్దపల్లి జిల్లా నాయకులు మార్క సతీష్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా పెద్దపల్లి లోని స్ఫూర్తి మానసిక వికలాంగుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి వారికి పండ్లు,బిస్కెట్స్,స్వీట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మహేందర్,విలాస్ గౌడ్,సాయి నిఖిల్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా కార్యదర్శిగా పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్

- అంకితభావంతో పనిచేస్తానని హామీ
- కేంద్ర,రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు

**సిద్దిపేట, తెలంగాణ చౌరస్తా:**



భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శిగా పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ నియమితులైనారు.విద్యార్థి దశలోనే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి)లో చేరి విద్యార్థి సమస్యలపై ఉద్యమాలు చేపట్టి,2009 లో భారతీయ జనతా పార్టీలో చేరారు.గ్రామ స్థాయి కార్యకర్తగా ప్రారంభమైన ప్రయాణం,నేడు సిద్ధిపేట జిల్లా కార్యదర్శి బాధ్యతల వరకు చేరుకోవడం పార్టీపై ఉన్న అంకితభావం, క్రమశిక్షణ, నిరంతర శ్రమకు నిదర్శనమం.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో,గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తూ క్రియాశీలక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుల్లో ఒకరైన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసే అవకాశం తన రాజకీయ జీవితంలో మరపురాని ఘట్టంగా భావిస్తున్నానని తెలిపారు.

**పార్టీలో నిర్వహించిన బాధ్యతలు..**

2009-2014: భారతీయ జనతా యువమోర్చా మండల అధ్యక్షులు (రెండు పర్యాయాలు)

2014-2015: ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువ మోర్చా కార్యదర్శి

2015-2019: మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి (రెండు పర్యాయాలు)

2019-2020: హనుమకొండ జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షులు

2020-2025: భీమదేవరపల్లి మండల బీజేపీ అధ్యక్షులు (రెండు పర్యాయాలు)

2025-2026: బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు

2026 నుంచి: భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట్ జిల్లా కార్యదర్శి భీమదేవరపల్లి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ధర్నాలు, నిరసనలు,సేవా కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు."ప్రజల సమస్యలే నా అజెండా - సేవే నా లక్ష్యం" అనే నినాదంతో ప్రజా సేవకు అంకితమై ముందుకు సాగుతున్నానని పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ....తన పై విశ్వాసం ఉంచి ప్రతి బాధ్యతను అప్పగించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ కి,సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్,కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,బోయినిపెల్లి ప్రవీణ్ రావు,గుర్రాల లక్ష్మారెడ్డి ధన్యవాదములు తెలిపారు. పార్టీ సిద్ధాంతాల కోసం మరింత అంకితభావంతో అహర్నిశలు శ్రమిస్తూ,పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు నా జీవితాన్ని అంకితం చేస్తానని పేర్కొన్నారు.



## ఆర్టీసీ కార్గో హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఈనెల 21న రాష్ట్ర సదస్సు
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్రంలోని టీజీ ఆర్టీసీ కార్గో లో పనిచేస్తున్న హమాలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 21వ తేదీన ఎంజీబీఎస్ హైదరాబాద్ బస్టాండులో రాష్ట్ర సదస్సు జరుగునని,ఈ సందర్భంగా కరీంనగర్ కార్గో డిపో ముందు సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరణ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పాల్గొని మాట్లాడుతూ.... రాష్ట్రంలోని అన్ని డిపోల్లో కార్గో లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని కార్గోలను ప్రైవేటీకరణ చేయొద్దని ఏజెన్సీలకు అప్పగించవద్దని ఆర్టీసీ హమాలి కార్మికులకు ఒక ఆర్టికల్ కు 20 రూపాయలు చెల్లించాలని,దీనితోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తూ హమాలి కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి,ఆర్టీసీ హాస్పిటల్లో ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని,రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో కార్మికులకు రెస్టు రూమలు ఏర్పాటు చేస్తూ కార్మికుల లైసెన్సులను,బస్సు పాస్ లను ప్రతి సంవత్సరం యధావిధిగా రెన్యువల్ చేయాలని తదితర డిమాండ్ల పైన రాష్ట్ర సదస్సు జరుగుతుందని,ఈ సదస్సులో రాష్ట్రంలోని అన్ని డిపోల కార్గో హమాలి కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని హమాలీలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్,ఆర్టీసీ కార్గో హమాలీ సంఘం నాయకులు లంక దాసరి లక్ష్మణ్,టి నరేష్,చిట్టి పోశయ్య,పప్పు శ్రీనివాస్,సతీష్,వీరయ్యతో పాటు హమాలి కార్మికులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమాలు

- ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మెన్ గుడిమల్ల రవి కుమార్

**హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:**

హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ అమర జ్యోతి ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశానికి హాజరైన తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమల్ల రవి కుమార్ చైర్మన్ ను తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు.ఈ మేరకు మాట్లాడుతూ....తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్ల సాధనకు తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక తరుపున ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకార ఐక్యవేదిక వరంగల్ అడహాక్ కమిటీ సభ్యుడు రాంపెల్లి శ్రీనివాస్ చారి ,ఎర్రం మనోహర్ రావు,వొడపెల్లి శ్యామ్,బొలిశెట్టి అశోక్,చాంద్ పాష,నెల్సన్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ షాప్‌లలో ఆకస్మిక తనిఖీ

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**



కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాపులలో సీజన్ విజిలెన్స్ ఎంక్వయిరీ లో భాగంగా విజిలెన్స్ డీఎస్పీ సీతా రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అన్నదాత ఫర్టిలైజర్ షాప్ తనిఖీ చేశారు.ఫర్టిలైజర్ దుకాణంలో ఎవరువుల స్టాక్, స్టాక్ రిజిస్టర్,ఈ.పి.ఓ.ఎస్ మెషిన్ మొబైల్ యాప్ ను తనిఖీ చేశారు.ఈ తనిఖీలలో విజిలెన్స్ సీతారెడ్డి,సి.ఐ అనిల్, తహసీల్దార్ దినేష్ రెడ్డి,మండల వ్యవసాయ అధికారిని సంధ్య ఉన్నారు.

## ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ప్రోత్సాహకం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**



ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగు పై ప్రత్యేక ప్రోత్సాహకం అందిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరాతో పాటు అంతర పంటల సాగు, తోట నిర్వహణ కోసం నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ పంట ద్వారా రైతులు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో పట్టా భూమి కలిగి ఆయిల్ పామ్ సాగు చేయదలచిన ఒంటరి మహిళా రైతులకు ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందించే నాలుగు సంవత్సరాల రాయితీలతో పాటు, రైతుకు అయ్యే అదనపు వ్యయాన్ని జిల్లా కలెక్టర్ ఆధీనంలోని నిధుల ద్వారా ప్రత్యేక రాయితీగా అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించడం, రైతులను ప్రత్యామ్నాయ లాభదాయక పంటల వైపు ప్రోత్సహించడం, అలాగే ఒంటరి మహిళలను ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ ప్రత్యేక ప్రోత్సాహకాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ఒంటరి మహిళా రైతులు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ సాగు చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సమీప ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

## చంద్రబాబును కలిసిన వల్లారపు

**తెలంగాణ చౌరస్తా, సికింద్రాబాద్ :**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును సికింద్రాబాద్ తెదేపా ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగుదేశం పార్టీ ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపధం కార్యక్రమం బౌద్ధనగర్ డివిజన్ పార్సిగుట్టలో ఘన విజయం సాధించిన విషయం చంద్రబాబుకు వివరించినట్లు తెలిపారు.ఈసందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ అందరు కష్టపడి పార్టీ పటిష్టతకు పని చేయాలని, ప్రజలతో మమేకమై ఉండాలని చంద్రబాబు ఆదేశించారని అన్నారు.

# 'ఆల్ఫోర్స్' నీట్–2026 చారిత్రాత్మక విజయం

- ఆకాశాన్ని తాకిన సంబరాలు
- హర్షం వ్యక్తం చేసిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థ అధినేత
- డా.వి నరేందర్ రెడ్డి
- ఫలితాలు ఏవైనా విజయకేతనం 'ఆల్ఫోర్స్' దే అంటూ వ్యాఖ్యలు










**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:** నిన్న ప్రకటించబడిన నీట్ 2026 ఫలితాలలో పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుందని,ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి నరేందర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఆల్ఫోర్స్ విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యద్భుత మార్కులు సాధించి నిరూపించారు.డి.రిత్విక్ 647 మార్కులతో అత్యున్నత స్థానంలో నిలువగా,సిద్ధాంత్ చతుర్వేది 564,సయ్యద్ మలాజుద్దీన్ 557,వసుల శ్రుత్విక 551,గులామ్ మహమ్మద్ హుస్సేన్ 548, బత్తుల అభిజ్ఞ 541,లింగంపల్లి అనంత్ సాయి 540,నార్ల శ్రీహిత 538,శ్రేయాంశ్ ద్వివేది 537, కొండ్ల అక్షిత 522,బొమ్మవరపు రుత్విక్ 515 జక్కుల శ్రీవైత్రి 512,టి.హర్షిత 509,సిద్దం సాత్విక 508,ఎ.సత్య బ్రాహ్మిణి 507,బి.అక్షర 505,నిద 502, గుంజేటి రిషిత 501,జహ్రా మాజీద్ 501 మార్కులు సాధించి ఆల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారని,నీట్ కోచింగ్ డాక్టర్స్ 30 ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా కోచింగ్ను అందించడం ద్వారా ఆల్ఫోర్స్ విజయపరంపర కొనసాగుతుందని,19 మంది విద్యార్థులు 500,ఆపై మార్కులు సాధించడం విశేషమన్నారు.సుమారుగా 100 మంది విద్యార్థులు వివిధ ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలలలో సీట్లు సాధించగలరని ఈ సందర్భంగా తెలియజేస్తున్నానని,పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ,విద్యార్థుల అకుంటిత దీక్ష,పట్టుదల మరియు కృషి వల్ల ఇంతటి ఘన విజయం సాధించడం జరిగిందని ,తక్కువ మంది విద్యార్థులతో అధికముగా సీట్లు సాధించడం ఆల్ఫోర్స్ విజయాలకు నిదర్శనమన్నారు.నీట్ అయిన ఐఐటి అయిన విద్యార్థులను విజయమార్గంలో నడిపిస్తున్న సంస్థ ఆల్ఫోర్స్ అని,ఇంతవరకు ప్రకటించబడిన అన్ని ఫలితాలలో ఆల్ఫోర్స్ ముందంజలో ఉండడం గమనార్హమన్నారు.తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికై కృషి చేస్తున్న ఆల్ఫోర్స్ను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ తమ పిల్లలను అల్ఫోర్స్లో చేర్పిస్తున్నందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతాభినందనలు తెలియజేయుచున్నానన్నారు.రాబోయే కాలములో అత్యధిక మంది విద్యార్థులను మెడికల్, ఐఐటి,ఎన్.ఐ.టిలలో సీట్లు సాధించే విధంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా తెలియజేయుచున్నానని, ర్యాంకులు సాధించిన ఆల్ఫోర్స్ అణిముత్యాలను అభినందిస్తున్నానని తెలిపారు.ఇంతటి విజయానికి తోడ్పడిన అధ్యాపక,అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.



## సర్ ప్రక్రియలో కాంగ్రెస్ నాయకులు పాల్గొనాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా** భారత ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన జనాభా గణన ప్రక్రియలు భాగంగా నిర్వహిస్తున్న సర్ ప్రక్రియలో కాంగ్రెస్ నాయకులు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ తోరూర్ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి పిలుపునిచ్చారు.పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ,టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని చింతలపల్లి, నాంచారి మడూరు గ్రామాలలో సర్ ప్రక్రియను బిఎల్ఎ,బిఎల్ఓ మరియు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం చేపడుతున్న సర్ ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అందుబాటులో ఉండాలన్నారు. సర్ సవరణ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎన్యుమరేటర్ ఫారాలను నింపాలని,వివరాలను సక్రమంగా నమోదు చేయాలనే అంశంపై నాయకులకు సూచించారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు జక్కుల రాం రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఇట్టే శ్యాంసుందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు పింగిలి ఉష, మడూరు సర్పంచ్ బంగారు రమేష్, చింతలపల్లి గ్రామ అధ్యక్షుడు అశోక్, ఉపసర్పంచ్ వడ్లకొండ యాకయ్య, మాజీ సర్పంచ్ కాటం మల్లారెడ్డి, నాయకులు ఇమ్మడి శ్రీనివాస్, మంద నరేందర్ రెడ్డి, దీకొండ మధు, ప్రభాకర్, వెంకటరెడ్డి, వడ్లకొండ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్నినో ప్రభావం ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

- నీటి లభ్యతను బట్టి పంటల ఎంపికపై శాస్త్రవేత్తల సూచన
- వరిలో తక్కువ కాలపరిమితి రకాలు,ఆరుతడి పంటల సాగుకు పిలుపు



**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:** ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్న తరుణంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలోని కమాన్‌పూర్, పేరపల్లి, జూలపల్లి, పెంచికలపేట్ గ్రామాలలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సదస్సులలో కూనారం ఏ ఆర్ సి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ చంద్ర పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు సుదీర్ఘ కాలపరిమితి గల వరి రకాల జోలికి వెళ్లకుండా, 120 రోజుల్లో చేతికి వచ్చే తెలంగాణ సోనా, కేఎన్ఎమ్ 1638 వంటి రకాలను ఎంచుకోవాలన్నారు. వీటిని వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేస్తే నీరు, సమయం ఆదా అవుతాయని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే పత్తి, కంది, పెసర, మినుము, ఆయిల్ పామ్ వంటి ఆరుతడి పంటలు వేసుకోవడం శ్రేయస్కరమన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు బొట్టు పెట్టే పద్ధతి ఉపయోగపడుతుందని, అలాగే దౌర చేయడం వల్ల నేలలో తేమ ఎక్కువ రోజులు నిలుస్తుందని వివరించారు. వెదజల్లే పద్ధతిలో వచ్చే కలుపు సమస్య నివారణకు విత్తిన 15 నుండి 25 రోజులలోపు తగిన కలుపు మందులు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏఈఓలు శ్వేత, నవీన్, గ్రామ సర్పంచులు రంగు సత్యనారాయణ గౌడ్, బొంగోని సదయ్య, పల్లె మాధవి నారాయణ, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## ముగ్గురు బాలురను సురక్షితంగా హాస్టల్‌కు చేర్చిన గద్దల పరుశురాం




**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా** తొర్రూర్ సమీకృత సంక్షేమ వసతి గృహానికి చెందిన ముగ్గురు చిన్నారి బాలురు రోడ్లపై దిక్కు తోచని స్థితిలో తిరుగుతుండగా,వారిని గుర్తించి సురక్షితంగా హాస్టల్‌కు చేర్చిన తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గద్దల పరుశురాం సేవాభావం స్థానికంగా ప్రశంసలు అందుకున్నారు.వివరాల్లోకి వెళితే.. సమీకృత సంక్షేమ వసతి గృహంలో నివసిస్తున్న తూర్పటి గణేష్ (6వ తరగతి), గంధం అమర్ (7వ తరగతి), జలగం శివ (8వ తరగతి)లు స్కూల్‌కు వెళ్తున్నామని చెప్పి హాస్టల్ నుంచి బయటకు వచ్చారు.అనంతరం పట్టణంలోని రోడ్లపై దిక్కుతోచని స్థితిలో తిరుగుతుండగా, ప్రజల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే గద్దల పరుశురాం వారిని గమనించారు.

వెంటనే స్పందించిన ఆయన బాలురను చేరదీసి వారి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులకు ధైర్యం చెప్పి, ఎలాంటి ప్రమాదం జరగకుండా స్వయంగా తన ద్విచక్ర వాహనంపై వారిని ఎక్కించుకుని సమీకృత సంక్షేమ వసతి గృహానికి సురక్షితంగా తీసుకెళ్లారు. అనంతరం హాస్టల్ యాజమాన్యానికి బాలురను అప్పగించి బాధ్యతాయుతంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ.. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ప్రజా సేవా దృక్పథానికి అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తున్నారని అన్నారు. చిన్నారుల భద్రత విషయంలో అప్రమత్తంగా స్పందించి వారిని సురక్షితంగా హాస్టల్‌కు చేర్చడం అభినందనీయమని పేర్కొన్నారు.గద్దల పరుశురాం చూపిన చొరవను హాస్టల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు ప్రశంసిస్తూ, సేవా స్ఫూర్తితో చేసిన ఈ చర్య ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.




## జగన్నాథం ఆశయ సాధనకై ఉద్యమిద్దాం

- సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్

**తొర్రూరు,-తెలంగాణ చౌరస్తా:** పెరుమాండ్ల జగన్నాథం గారి ఆశయ సాధనకు యువత పాటుపడాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ అన్నారు. శుక్రవారం రోజు గుర్తురు గ్రామంలో అమరజీవి కామ్రేడ్ పెరుమాండ్ల జగన్నాథం గారి 45వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం పార్టీ తోరూర్ మండల కార్యదర్శి ఎండి యాకుబ్ అధ్యక్షతన సభ జరిగింది. ముందుగా గ్రామ సీనియర్ నాయకులు ఉమ్మగాని యాకయ్య జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సభలో జగన్నాథం ను ఉద్దేశించి అశోక్ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లా మానుకోట తాలూకాలో సిపిఎం పార్టీ ఉద్యమ నిర్మాతలలో జగన్నాథంది ప్రముఖ పాత్రని వారు కొనియాడారు. ఆ రోజుల్లోనే జీతగాండ్లకు జీతాలు పెరగాలని, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి జీతాలు పెంచిన ఘనత జగన్నాథందని వారు అన్నారు. కల్లుగీత కార్మికుల హక్కుల కోసం, మహబూబాబాద్ తాలూకా కార్యదర్శిగా ఉండి అప్పుడున్న కలెక్టర్ కాకి మాధవరావు తో మాట్లాడి కల్లుగీత కార్మికులకు సొసైటీలు ఏర్పాటు చేయించి, వారికి రుణాలు వచ్చేలా,తాటి చెట్టు పై హక్కులు వచ్చేవరకు పోరాటం చేసి సాధించిన నాయకుడు జగన్నాథం అనివారన్నారు.నిత్యం పేదల కోసం పరితపించే వ్యక్తిత్వం జగన్నాథం దని వారు కొనియాడారు. ఇది ఓర్వలేని కాంగ్రెస్, రాడికల్ గుండాలు జగన్నాథం గారిని హత్య చేశారని, జగన్నాథం మరణం ఈ ప్రాంతంలో వాపక్ష ఉద్యమానికి తీరని లోటు అని వారు ఈసందర్భంగా అన్నారు. జగన్నాథం మరణించి 45 సంవత్సరాలైనా కూడా వారు పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేమని వారి ఆశయ సాధన కోసం ఎల్లవేళల కృషి చేస్తామని వారు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదోడిని మరింత పేదోడిని చేసే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి తప్ప,పేదోడికి కష్టాలు తీర్చే ప్రభుత్వాలు కాదని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ,పెట్టుబడిదారుల వైపు కాకుండా, పేదల పక్షం ఆలోచించి,ప్రభుత్వ నిర్ణయాలు చేయాలని, ప్రభుత్వ నిర్ణయాలలో మార్పులు మారకకపోతే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జగన్నాథం కన్న కలల కోసం ప్రజలందరూ ఎదురు తిరగాల్సిన అవసరం ఉందని వారి సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు జమ్మల శ్రీను, దోనకా దుర్గయ్య బోర స్వామి,బొల్లం మమత, వెంకట్ రెడ్డి,తాళ్ల వెంకటేశ్వర్లు,శంకర్,కౌసర్ల లక్ష్మయ్య, కోటగిరి సంతోష్,కొండ రాము, తిమిడి రవి,రాధా,భాగ్య, సమీనా, శ్రీలత, వరలక్ష్మి, చెన్నమ్మ,వారి కుటుంబ సభ్యులు పెరుమాండ్ల మధుబాబు,సరోజన, లెనిన్ బాబు వారి పిల్లలు అందరూ పాల్గొన్నారు.




## చందనాపూర్ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు,కంపాస్ బాక్సుల పంపిణీ

**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్లు, కంపాస్ బాక్సులు, నోట్ బుక్స్ స్వీట్లను వేర్వేరుగా పంపిణీ చేశారు. చింతకింది కృష్ణ రజినిల కుమార్తె శ్రీనిధి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు దీటి శ్రీనివాస్ సరితల కుమారుడు రాహుల్ పుట్టినరోజుల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, కంపాస్ బాక్సులు, స్వీట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల విద్యాధికారి కొమురయ్య, చందనాపూర్ పీజీహెచ్ఎం లక్ష్మి, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ రాచర్ల శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ప్రెసిడెంట్ కిషోర్, చింతకింది విశ్వనాథం, విజయ దంపతులు పాల్గొని పిల్లలను ఆశీర్వదించారు.

**తమ్ముని జ్ఞాపకార్థం 80 ప్లేట్ల వితరణ**

మరో కార్యక్రమంలో, జూల నవీన్ తన తమ్ముడు జూల ప్రవీణ్ జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులపై అభిమానంతో 80 భోజనం ప్లేట్లను ఉచితంగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై ఇటువంటి ప్రేమ, సేవాభావం కలిగి ఉండడం హర్షించదగ్గ విషయమని పేర్కొంటూ హెడ్మాస్టర్ రాచర్ల శ్రీనివాస్ ఉపాధ్యాయ బృందం జూల నవీన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొమురయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## ఐఐటీ బాసరలో సీటు సాధించిన మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

- ప్రథమ,ద్వితీయ ర్యాంకర్లకు ఘన సన్మానం
- విద్యార్థులను అభినందించిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు,
- ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్



**మేడిపల్లి తెలంగాణ చౌరస్తా:** మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం. చందన పాఠశాల ప్రథమ ర్యాంకర్‌గా నిలిచి, ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ బాసరలో సీటు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. పాఠశాల ద్వితీయ ర్యాంకర్ ఆయేషా సిద్దిఖ్ కూడా మంచి ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు విద్యార్థుల పట్ల తనకున్న మక్కువతో, విద్య పట్ల ఉన్న అభిరుచితో స్వచ్ఛందంగా ప్రథమ ర్యాంకర్ ఎం. చందన, ద్వితీయ ర్యాంకర్ ఆయేషా సిద్దిఖ్‌లను ఘనంగా సన్మానించారు. వారికి నగదు బహుమతులు, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్య ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల విజయాలను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు శ్రీనివాసరావు చూపుతున్న చొరవను అభినందించారు. విద్యార్థుల పట్ల, విద్య పట్ల ఆయనకు ఉన్న ప్రత్యేకమైన అభిరుచికి కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులందరూ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## బాసర ట్రిపుల్‌లో ఇల్లందు విద్యార్థికి సీటు

- సాధించిన ఇల్లందు 'మాస్టర్ మైండ్' విద్యార్థి అబ్దుల్ రెహమాన్
- కూలీ పనులు చేసుకునే పేద తల్లిదండ్రుల కుమారుడికి ప్రతిష్టాత్మక సీటు
- విద్యార్థిని అభినందించిన పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం



**ఇల్లందు,భద్రాద్రి బ్యూరో తెలంగాణ చౌరస్తా :** ఇల్లందు పట్టణంలోని సుభాష్ నగర్ లో గల ప్రముఖ విద్యాసంస్థ "మాస్టర్ మైండ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్" విద్యార్థి అబ్దుల్ రెహమాన్ అద్భుత ప్రతిభ కనబరిచారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించిన రెహమాన్, బాసర ట్రిపుల్ ఐటీ ( ఆర్ జి యు కె టి) ప్రవేశాల్లో ప్రతిష్ఠాత్మకమైన సీటును కైవసం చేసుకున్నారు. ఇల్లందు పట్టణంలో మరే ఇతర పాఠశాల విద్యార్థి సాధించలేని ఈ ఘనతను మాస్టర్ మైండ్ విద్యార్థి సాధించడం పట్ల పట్టణ ప్రజలు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టాన్ని నమ్ముకుని.. కన్నవారి కల నిజం చేసి: ఇల్లందు మండలం కొల్లాపురం గ్రామానికి చెందిన అబ్దుల్ రెహమాన్ తల్లిదండ్రులు అత్యంత నిరుపేదలు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తన కుమారుడిని ఇల్లందు మాస్టర్ మైండ్ స్కూల్లో చదివిస్తూ వచ్చారు. తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన అబ్దుల్ రెహమాన్.. ఎలాగైనా ఉన్నత చదువులు చదివి వారి భారాన్ని తగ్గించాలనే పట్టుదలతో కష్టపడి చదివారు. క్రమశిక్షణ, నిరంతర శ్రమతో నేడు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి, తన కష్టానికి తగిన ప్రతిఫలాన్ని పొందారు. ఈ విజయంతో అటు కొల్లాపురం గ్రామానికి, ఇటు చదువుకున్న పాఠశాలకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టారు.

**ఘనంగా అభినందనలు:**

ఈ సందర్భంగా బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన అబ్దుల్ రెహమాన్‌ను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. పాఠశాల డైరెక్టర్ కరస్పాండెంట్ హెడ్మాస్టర్ జక్కుల సర్వేశ్వరరావు, డైరెక్టర్ పెరుగు రామకృష్ణ గారలు మాట్లాడుతూ.. రెహమాన్ క్రమశిక్షణతో చదివి పాఠశాల పేరు నిలబెట్టాడని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థి ప్రతిభను గుర్తించి వెన్నుతట్టి ప్రోత్సహించిన ఫిజిక్స్ అధ్యాపకులు విజయ్, మ్యాథ్స్ అధ్యాపకులు నరసయ్యలతో పాటు ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థి తల్లిదండ్రులకు యాజమాన్యం కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలియజేసింది .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొని అబ్దుల్ రెహమాన్‌కు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షల పరంపరను కొనసాగించారు.

## అశ్వారావుపేటలో గుట్టురట్టయిన వ్యభిచార గృహం

- ఇద్దరు నిర్వాహకుల అరెస్ట్, ఇద్దరు బాధితుల రెస్క్యూ
- పోలీసుల ఆకస్మిక దాడి
- చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవు
- ఎస్ఐ యయాతి రాజు హెచ్చరిక

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:** అశ్వారావుపేటలో నిర్వహిస్తున్న ఒక వ్యభిచార గృహంపై పోలీసులు ఆకస్మిక దాడి చేసి నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన నమ్మదగిన సమాచారం మేరకు, పాల్వంచ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఆదేశాల ప్రకారం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ యయాతి రాజు తన సిబ్బందితో కలిసి ఈ దాడి నిర్వహించారు. వ్యభిచారం నిర్వహిస్తున్న గృహం నుండి ప్రధాన నిర్వాహకుడైన నాయుడు ముత్యాలరావుతో పాటు మరొక మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ దందాలో చిక్కుకున్న ఇద్దరు మహిళలను సురక్షితంగా రెస్క్యూ చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నాయుడు ముత్యాలరావు, సదరు మహిళ ఇద్దరూ కలిసి ఇతర ప్రాంతాల నుండి మహిళలను తీసుకువచ్చి ఇక్కడ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు నిర్ధారణ అయింది. పట్టుబడిన నిందితులపై చట్టప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుపై మరిన్ని వివరాల కోసం దర్యాప్తు కొనసాగుతోంది. సమాజంలో వ్యభిచారం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# తెలంగాణ చౌరస్తా ఎఫెక్ట్...
# రంగంలోకి రెవెన్యూ టాస్క్‌ఫోర్స్

- వరుస కథనాలతో.... కదిలిన లేడి సింగం ఎంఆర్వో శిరీష!
- 'చౌరస్తా' సెన్సేషనల్ వార్తతో లక్ష్మీదేవిపల్లి రెవెన్యూ రాజ్యంలో ప్రకంపనలు...
- కథనం వచ్చిన క్షణాల వ్యవధిలోనే క్షేత్రస్థాయికి 'రెవెన్యూ టాస్క్‌ఫోర్స్'.. ఆర్ఐ, సర్వేయర్ల ముమ్మర తనిఖీలు!
- "గతంలోనే వెంచర్లు వేశారు.. డీటీసీపీ, నాలా లీలల గుట్టు త్వరలోనే రట్టు చేస్తా"
- తాసిల్దార్ శిరీష సింహగర్జన!
- "తెలంగాణ చౌరస్తా' కథనానికి అదిరిపోయే ఎఫెక్ట్....


తెలంగాణ చౌరస్తా
15/07/2026 | Page No: 4
epaper.telanganachowrasta.com

దేవుడికి దండం పెట్టాలి..
ప్లాట్ కొన్న వాళ్ళు నెత్తిన చేయి పెట్టాలి!

- గుట్ట పైన దేవుడు.. గుట్ట కింద అక్రమార్కుల అరాచకం!
- లక్ష్మీదేవిపల్లిలో రియల్ మాఫియా విచ్చలవిడి దందా..!
- నిమ్మకు నీరెత్తిన అధికారులు !
- ఏసి గదులకే పరిమితమైన అధికారులు
- ముడుపుల మత్తులలో మాయా..
- 1/70 యాక్ట్ వెన్నుపోటు బినామీల ముసుగులో ఉన్నది ఎవరు



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :

epaper.telanganachowrasta.com


తెలంగాణ చౌరస్తా
17/07/2026 | Page No: 4
epaper.telanganachowrasta.com

బినామీల ముసుగు వెనుక
అక్రమార్కులు ఎవరు..?

- గుట్టపైన దేవుడు.. గుట్ట కింద అక్రమార్కుల నగ్న నర్తనం!
- అధికారులు ఎందుకు ఇంత మౌనం...!
- లక్ష్మీదేవిపల్లిలో 1/70 చట్టానికి సమాధి..
- రియల్ మాఫియా గుండాయిజం..!
- నోట్ల కట్టల మత్తులో రెవెన్యూ, పంచాయతీ అధికారులు.. ఏసీ రూములకే పరిమితం!
- బినామీల గుట్టు రట్టు చేస్తాం ఆర్ టి ఐ అస్త్రంతో గిరిజనుల యుద్ధప్రకటన.. గ్రీవెన్స్ డే నాడు కలెక్టరేట్ ముట్టడికి సై!

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

లక్ష్మీదేవిపల్లి మండలంలో బినామీల ముసుగులో సాగుతున్న రియల్ మాఫియా ఆగడాలపై, ఏజెన్సీ చట్టం 1/70 ఖూనీపై 'తెలంగాణ చౌరస్తా' పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనం జిల్లావ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. ఈ కథనానికి అధికార యంత్రాంగంలో ఊహించని ఎఫెక్ట్ కనిపించింది. లక్ష్మీదేవిపల్లి మండల రెవెన్యూ అధికారి (ఎమ్ ఆర్ ఓ ) శిరీష ఈ వార్తపై మెరుపు వేగంతో స్పందించారు. అధికారులపై వచ్చిన ఆరోపణలను సవాల్‌గా తీసుకుంటూ, నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోకుండా.. ఒక 'లేడి సింగం'లా కదలివచ్చి తనదైన శైలిలో 'మార్క్' యాక్షన్‌కు శ్రీకారం చుట్టారు.

**'తెలంగాణ చౌరస్తా' వార్తతో కదిలిన యంత్రాంగం.. స్పాట్‌లో సర్వే!**

'తెలంగాణ చౌరస్తా'లో కథనం బ్యానర్ స్టోరీగా రావడంతో పాటు, గ్రీవెన్స్ డే నాడు గిరిజన సంఘాల కలెక్టరేట్ ముట్టడి హెచ్చరికల నేపథ్యంలో ఎమ్ ఆర్ ఓ శిరీష తక్షణమే రంగంలోకి దిగారు. ఆర్డర్ కాపీలు పట్టుకుని ఆఫీసులకే పరిమితమయ్యే పద్ధతికి స్వస్తి చెప్పి, సమర్థులైన అధికారుల టీమ్‌ను స్పాట్‌కు పరుగులు తీయించారు.

**యుద్ధప్రతిపాదికన స్క్రీనింగ్:**

తాసిల్దార్ శిరీష ఇచ్చిన కఠినమైన ఆర్డర్‌తో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ ఐ ), సివిల్ సర్వేయర్లు క్షణాల వ్యవధిలో వివాదాస్పద వెంచర్ స్థలానికి చేరుకున్నారు.

ఇంచంగుళం తనిఖీ: "రికార్డుల్లో ఒక్క తేడా ఉన్నా సహించేది లేదు" అన్న ఎమ్ ఆర్ ఓ కఠిన హెచ్చరికలతో.. సర్వే బృందం డిజిటల్ మీటర్లు, టిప్పన్ రికార్డులు పట్టుకుని వెంచర్ పరిధిలోని ప్రతి గుంట భూమిని పక్కాగా సర్వే చేసింది. కొండలు, గుట్టలు, ప్రభుత్వ పోరంబోకు స్థలాల సరిహద్దులను క్షుణ్ణంగా పరిశీలించారు.

**చౌరస్తా' పత్రికకు, డైనమిక్ ఎమ్ ఆర్ ఓ కి ప్రజల జేజేలు!**

అక్రమ వెంచర్ల వెనుక ఉన్న తిమింగలాల గుట్టు రట్టు చేస్తూ ధైర్యంగా వార్త రాసిన 'తెలంగాణ చౌరస్తా' పత్రికా యాజమాన్యానికి, వార్త వచ్చిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా సింగంలా గర్జించి విచారణకు ఆదేశించిన ఎమ్ ఆర్ ఓ శిరీష డైనమిక్ శైలిపై స్థానిక ప్రజలు, గిరిజన సంఘాల నుంచి ప్రశంసల జల్లు కురుస్తోంది. ఒక నిజాయితీ గల అధికారిగా ఆమె తీసుకున్న ఈ నిర్ణయం.. అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టిస్తుండగా, సామాన్య ప్రజల్లో మాత్రం నమ్మకాన్ని నింపుతోంది.

## అక్రమార్కులకు తాసిల్దార్ శిరీష స్ట్రాంగ్ వార్నింగ్

"లక్ష్మీదేవిపల్లి మండలంలో వివాదాస్పదంగా మారిన సదరు వెంచర్లు ఈ మధ్య కాలంలో వేసినవి కావు, ఇవి గతంలోనే వేసినట్లు మా ప్రాథమిక విచారణలో తేలింది. అయితే.. గతంలో వేసినంత మాత్రాన నిబంధనల ఉల్లంఘనలను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. 'తెలంగాణ చౌరస్తా' పత్రికలో వచ్చిన కథనాన్ని సుమోటోగా తీసుకుని పూర్తిస్థాయిలో లోతుగా విచారణ జరుపుతున్నాం.సదరు వెంచర్లకు సంబంధించిన డీటీసీపీ అనుమతులు అసలు ఉన్నాయా? వ్యవసాయ భూమిని కమర్షియల్‌గా మార్చే నాలా ప్రక్రియ సక్రమంగా జరిగిందా లేదా? అనే అంశాలపై రికార్డులను నిశితంగా తిరగేస్తున్నాం. క్షేత్రస్థాయి సర్వే నివేదిక నా చేతికి రాగానే.. డీటీసీపీ, నాలా అనుమతుల వెనుక ఉన్న అసలు నిజానిజాలను, పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తాను. చట్టాన్ని చుట్టాలుగా మార్చుకుని 1/70 ఏజెన్సీ చట్టాన్ని ఉల్లంఘించినా, ప్రభుత్వ భూములను తాకినా ఎంతటి వారినైనా సరే.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు."

**– శిరీష, తాసిల్దార్ (ఎమ్ ఆర్ ఓ ), లక్ష్మీదేవిపల్లి.**

# సోనమ్ వాంగ్‌చుక్‌కు ఏమైనా కేంద్ర ప్రభుత్వందే బాధ్యత

- పిడిఎస్ యూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం
- నీట్ పరీక్ష పత్రాల లీకేజ్ కు బాధ్యత విద్యాశాఖ మంత్రిదే
- తక్షణమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.
- పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి. మహేష్, పొడపంగి నాగరాజు.
- సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను కేంద్ర ప్రభుత్వం విరమింప చేయాలి.
- గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు మంద నవీన్ ,కె శ్రీనివాస్



**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:**

భారతీయ ఇంజనీరు, విద్యా సంస్కర్త, ఆవిష్కర్త, పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ గత 19 రోజులుగా నీట్ పరీక్ష పేపర్ లీక్, సి బి ఎస్ సి పరీక్షల అవకతవకలపై వ్యతిరేకంగా ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ఆమరణ నిరాహార దీక్ష ను విరమింప చేయాలని , కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని పిడిఎస్ యూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో హిందీ మహావిద్యాలయం సిగ్నల్ దగ్గర కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి మహేష్, పొడపంగి నాగరాజు,గ్రేటర్ హైదరాబాద్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మంద నవీన్, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. సోనమ్ వాంగ్‌చుక్ గత 19 రోజులుగా దేశంలో జరుగుతున్న వివిధ ప్రశ్నాపత్రాల లీకలను అరికట్టాలని, దీనికి కేంద్ర విద్యా శాఖ మంత్రి బాధ్యతగా వ్యవహరించి రాజీనామా చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నాడు.ప్రస్తుతం ఆయన ఆరోగ్యం అత్యంత క్షీణత దశలో ఉందని అయినా కూడా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరి కాదని అన్నారు. దేశవ్యాప్తంగా సోనమ్ వాంగ్‌చుక్‌కు అన్ని రకాల విద్యార్థి సంఘాలు, మేధావుల నుంచి, ఇతర రాజకీయ పార్టీల నుంచి మద్దతు వస్తున్నా కూడా కేంద్ర ప్రభుత్వం తన ఫాసిస్టు పోకడలకు అద్దం పడుతుంది అని అన్నారు. ఈ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకుల వలన దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలో విద్యార్థులు చనిపోయిన కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.తక్షణమే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఆయన నిరాహార దీక్షను విరమింప చేయాలని అన్నారు.అలాగే బాధ్యులపై తక్షణమే శిక్షించాలని, విద్యార్థుల భవిష్యత్తు కోసం, విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలని, ఈ దేశంలో సురక్షితమైన, నమ్మకమైన పరీక్ష వ్యవస్థను ఏర్పాటు చేయాలని లేకుంటే దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను ఉదృతం చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు గడ్డం గౌతమ్ సహాయ కార్యదర్శిలు ఝాన్సీ, గడ్డం గణేష్, జిల్లా నాయకులు నవదీప్, శరత్, నాగరాజ్, కుమార్, అరవింద్ ,హరీష్, వెంకటేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ నూతన అధ్యక్షులు నియామకం

- తొలి విడతలో నియోజకవర్గంలోని 7 సొసైటీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- మిగతా 6 సొసైటీలకు రెండో విడతలో నియమించే అవకాశం
- 7 సొసైటీలకు అధ్యక్షునితోపాటు 12 మంది సభ్యులను డైరెక్టర్లుగా నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం








**పెద్దపల్లి/ సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :**

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల( పీఏసీఎస్) నూతన అధ్యక్షులు నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ జారీ చేసింది. జిల్లాలోనే అత్యధికంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పెద్దపల్లి నియోజకవర్గంలో ఉన్నాయి. మొత్తం 13 పీఏసీఎస్ లు ఉండగా, తొలి విడతలో 7 సొసైటీలకు అధ్యక్షులు నియామకానికి శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన 6 సొసైటీల విషయంలో స్థానిక నాయకుల మధ్య సమన్వయం, రాజకీయ సమీకరణాలపై చర్చలు జరిపి రెండో విడతలో నిర్ణయించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొదటి విడతలో పెద్దపల్లి సింగిల్ విండో నూతన అధ్యక్షులుగా ముత్యాల నరేష్, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి సింగిల్ విండో అధ్యక్షులుగా కల్లేపల్లి జానీ, చిన్నకల్వల సింగిల్ విండో అధ్యక్షులుగా గౌరవెల్లి మురలీధర్ రావు, కనుకుల సింగిల్ విండో అధ్యక్షులుగా చిలుక సతీష్‌కుమార్, సుద్దాల సింగిల్ విండో అధ్యక్షులుగా అన్నాడి భాస్కర్ రెడ్డి, జూలపల్లి సింగిల్ విండో అధ్యక్షులుగా లోక జలపతి రెడ్డి, ఎలిగేడు సింగిల్ విండో అధ్యక్షులుగా సామ రాజేశ్వర్ రెడ్డి లను నియమిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణారావుకు నూతన చైర్మన్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 7 సొసైటీల నూతన అధ్యక్షులకు ఎమ్మెల్యే విజయ రమణారావు శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా వారి సేవలకు కట్టుబడి పనిచేస్తామని సింగిల్ విండో నూతన చైర్మన్లు పేర్కొన్నారు.



# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు..

**తెలంగాణ చౌరస్తా వెబ్ డెస్క్:**

అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. వాటిని పక్కనపెట్టి, సీజ్ ఫైర్ రద్దుచేసుకుని మరీ దాడులకు దిగాయి. దాంతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ వాతావరణం నెలకొంది. గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. దక్షిణ ఇరాన్‌పై అమెరికా మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ క్షిపణి దాడుల తర్వాత అనేక కీలక ప్రాంతాలలో విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధి పరిసరాల్లో వరుసగా రెండో రోజు కూడా దాడులు కొనసాగాయి. మరోవైపు బహ్రెయిన్‌లో ఎయిర్ రైడ్ సైరన్లు మోగాయి. అక్కడ ఉన్న అమెరికా బేస్ క్యాంపులను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది.

**దక్షిణ ఇరాన్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత**

ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం, అమెరికా తాజా దాడుల్లో బందర్ అబ్బాస్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు దెబ్బ తిన్నాయి. అయితే చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. కొన్నిచోట్ల పరిస్థితి సాధారణ స్థితికి వస్తోంది. నోబోన్యాద్ 1 ప్రాంతంలో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, ఆ తర్వాత లైన్ క్లియర్ చేసినట్లు సంబంధిత మంత్రిత్వ శాఖ తెలిపింది. పీక్ అవర్స్‌లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని దక్షిణ ఇరాన్ ప్రజలను అధికారులు కోరారు.

ఎయిర్ రైడ్ సైరన్లు మోగిన తర్వాత ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, సమీపంలోని సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని బహ్రెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. మరోవైపు ఇరాన్ ప్రభుత్వ అనుబంధ 'తస్నీమ్' వార్తా సంస్థ ప్రకారం, బహ్రెయిన్‌లోని సాఖిర్ ఎయిర్‌బేస్‌లో ఉన్న అమెరికా హెలికాప్టర్లు, నిఘా విమానాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్లు ఇరాన్ సైన్యం పేర్కొంది.హర్మూజ్ జలసంధిని పర్యవేక్షిస్తున్న అత్యంత కీలకమైన సిరిక్ నగరంలో రెండో రోజు కూడా అమెరికా వైమానిక దాడులు కొనసాగాయి. బుషెహర్‌లో కూడా దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఖామిర్ రేవు సమీపంలోని 2 వంతెనలను లక్ష్యంగా చేసుకోగా, ఇద్దరు వ్యక్తులు మరణించగా, నలుగురు గాయపడ్డారని అధికారులు తెలిపారు.బందర్ అబ్బాస్‌లోని అల్లాహో అక్బర్ ప్రాంతంలో కూడా అమెరికా దాడులు కొనసాగిస్తోందని ఇరాన్ సైన్యం పేర్కొంది. ఒక నివాస ప్రాంతంపై జరిగిన దాడిలో ఒకరు చనిపోగా, ఎనిమిది మంది గాయపడ్డారు. బందర్ అబ్బాస్ సమీపంలోని రైల్వే వ్యవస్థను అమెరికా ఆర్మీ లక్ష్యంగా చేసుకుని చేపట్టిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పరస్పర దాడుల సమయంలో ఇరాన్‌లోని ఇరాన్‌షహర్ ఎయిర్‌పోర్టును కూడా అమెరికా సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఎయిర్‌పోర్టు మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని ప్రాథమికంగా అంచనా వేశారు.100 మంది అమెరికా సైనికుల్ని కిడ్నాప్ చేయండి పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలపై భూతల దాడులు జరిపి, కనీసం 100 మంది US సైనికులను కిడ్నాప్ చేసి ఇరాన్‌కు తరలించాలని ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి, ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు మనుచెహర్ మొత్తకి పిలుపునిచ్చారు. అమెరికాతో కుదుర్చుకునే ఏ అవగాహన ఒప్పందమైనా కేవలం ఒక మోసపూరిత ప్రణాళిక మాత్రమేనని స్పష్టం చేశారు. గతంలోనూ ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మొత్తకి, తమ దేశ సర్వోన్నత నేత అయతుల్లా అలీ ఖమేనీ మరణానికి అమెరికాపై ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా సైనిక స్థావరాలను ఆక్రమించడమే ఏకైక లక్ష్యంగా ఇరాన్ సైన్యం తక్షణమే దాడులకు దిగాలని ఆయన కోరినట్లు స్థానిక మీడియా సంస్థల కథనాలు వెల్లడించాయి